క్లుప్తంగా

బుడమేరులో గుర్రపుడెక్క తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్):బుడమేరులో పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్తను గురువారం వీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది బోట్ సహాయంతో తొలగించారు. చెత్తచెదారంను బుడమేరులో వేయటం వల్ల నీటి ప్రవాహానికి కలుగుతున్నాయి. అలాగే పేరుకుపోతున్న గుర్రపు డెక్క వల్ల దోమలు సైతం పెరిగే అవకాశం ఉండటంతో బుడమేరులోని గుర్రపు డెక్క, చెత్తచెదారంను తొలగించారు.

బాబాకు ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్):వినాయక చవితి మహోత్సవాలను పసుపుతోట దత్త సాయి మందిరంలో గురువారం పురస్కరించుకుని ఆలయంలోని బాబా, వినాయకులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహన రావు విశేషంగా పూజలు చేశారు. శ్రీసాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. మధ్యాహ్నం దాతల సహకారంతో బాబాకు అన్నాభిషేకం నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శాస్త్రీయ విజ్ఞానం ప్రగతికి సోపానం



విజయవాడకల్చరల్: శాస్త్రీయ విజ్ఞానం ప్రగతికి సోపానమని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక, జన విజ్ఞానం సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్యయాత్ర రాష్ట్ర ప్రచార కార్యక్రమాన్ని గురువారం కొత్తా పూర్ణానందం కళావేదకమీద గురువారం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ మూఢనమ్మకాలు ప్రగతి నిరోధకాలు అన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరచడానికి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి, శింగంశెట్టి చంద్రశేఖర్, జనవిజ్ఞాన వేదిక సభ్యులు శ్రీనివాస్, మురళీధర్, మురళీమోహన్, గంగాధర్ పాల్గొన్నారు. సీనియర్ గాయకుడు దేవిడ్‌రాజు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు మల్లాది స్వాతి, అయ్యప్పన్, రాంబాబు, నల్లపాడు పరమేశ్వరి, రమ్‌జాబీ, దుర్గానాగమణి చైతన్య గీతాలను ఆలపించారు.

దాసాంజనేయుని హుండీ లెక్కింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్):స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ఆదాయం రూ. 4లక్షల 36వేల 422 నగదు, 30 అమెరికన్ డాలర్‌లు, 10 కెనడా డాలర్స్ లభించాయి. గురువారం దేవదాయశాఖ తనిఖీ అధికారి ఎ.సుజన్ కుమార్, సేవాసంఘం, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. రెండు నెలల 10 రోజులకు గానూ ఈ ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి తెలిపారు.

పట్టుదలతో సాగితే విజయాలు సొంతం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విద్యార్థులు వ్యాపారరంగంలో పట్టుదలతో ముందుకు సాగితే చక్కని విజయాలను సొంతం చేసుకోవచ్చని నేషనల్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ రాజీకమల్ పేర్కొన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సపోర్టింగ్ ఫస్ట్ జనరేషన్ ఎంటర్‌ప్రెన్యూయర్స్' అనేఅంశంపై కళాశాలలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రాజకుమాల్ మాట్లాడుతూ విద్యార్థులకు అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొదటి తరం వ్యాపారులకు అనేక సవాళ్లు, అవకాశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



కార్మికపురంలో స్వామివారికి పూజలు చేస్తున్న మల్లాది విష్ణు



బాబా మందిరంలో వినాయకునికి పూజలు చేస్తున్న గౌతంరెడ్డి దంపతులు



కండ్రికలో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు

కొలువుదీరిన గణనాథులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):నగరంలోని దేవాలయాలు, పలు కూడళ్లలో బుధవారం గణపతి కొలువుతీరాడు. మధురానగర్, ముత్యాలంపాడు, రామకృష్ణాపురం, దేవీనగర్, దావుబుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, మాచవరం, దుర్గాపురం, బావాజీపేట, భానునగర్, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో భారీ వర్షంలో సైతం నిర్వాహకులు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు సైతం ఒక పక్క వర్షం పడుతున్నా లెక్క చేయకుండా దేవాలయాలు, వినాయక పందిళ్ళకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు చేశారు. విఘ్నాలు తొలగించే వినాయకుడు ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ కోశాధికారి మందలపర్తి సత్య శ్రీహరి పర్యవేక్షించారు. కార్మికపురంలో వినాయక చవితి వేడుకలలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలతో బంధాలు పటిష్టం అవుతాయని ప్రజలు కలిసి మెలిసి పండుగలు జరుపుకోవాలని సూచించారు. వినాయకుని భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయని అన్నారు. ఏటా వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. పర్యావరణ హితంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఒక పక్క భారీ వర్షం పడుతున్నా భక్తులు లెక్క చేయకుండా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. దత్తసాయి శివ



దావు బుచ్చయ్యకాలనీలో సంప్రదాయ దుస్తుల్లో పూజలు చేస్తున్న యువకులు

కామేశ్వరీ పీఠంలో ధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు స్వామివారికి విశేషంగా పూజలు అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. మధురానగర్ వీవీనరసరాజు మందిరంలో వ్యవస్థాపకులు గడ్డం మేస్త్రి స్వామివారికి ప్రీతికరమైన పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. 30వ డివిజన్ వినాయకనగర్‌లో చవితివేడుకలలో కార్పొరేటర్ బీ హెచ్ఎస్‌వీ జానారెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ ఏటా చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులు, రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రవి లను అభినందించారు. పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. 26వ డివిజన్‌లో వినాయక చవితి కార్యక్రమంలో కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు వి.సతీష్, తోట పాండు తదితరులు పాల్గొన్నారు.

వినాయకునికి మల్లాది విష్ణు ప్రత్యేక పూజలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గణపతి నవరాత్రులను పురస్కరించుకొని బీసెంట్ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయకునికి వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త , మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథునికి హారతి ఇచ్చి నమస్కరించుకున్నారు. నిర్వాహకులు మల్లాది విష్ణును శాలువాతో సత్కరించారు.

విఘ్నాలు తొలగించాలని పూజలు

పాయకాపురం(విజయవాడరూరల్):విఘ్నాలు తొలగించి, విజయాలు చేకూర్చాలని కోరుతూ వినాయకునికి భక్తులు పూజలు చేశారు. పాయకాపురం ప్రాంతంలోని నాలుగు డివిజన్లలో జోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రతి వీధిలో భక్తులు వినాయకుని విగ్రహాలను ఏర్పాటు తమ ఇష్ట దైవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న కండ్రికలోని లక్ష్మీ గణపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రతి రోజూ అన్నదాన ప్రసాదం అందిస్తున్నారు. తొలి రోజు వినాయకునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కె.రవికుమార్ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి పీతల పై కూర్చొని పూజలు చేశారు. రాజీవ్‌నగర్ లో మెగా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా వినాయకుని నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆ ప్రాంతంలో భక్తులు పిల్ల, పెద్దలతో అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు. పైపులరోడ్డు లో కార్తీకేయ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి తొలి పండుగ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో వినాయకునికి పూజలు చేస్తున్న గడ్డం మేస్త్రి

సర్వశుభకరుడు విఘ్నేశ్వరుడు

విజయవాడ కల్చరల్: సర్వశుభకరుడు విఘ్నేశ్వరుడని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. విఘ్నేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలో నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. విఘ్నేశ్వరుని కృపతో అరిష్టాలు దరి చేరవన్నారు. ఉత్సవాలు కులమతాలకు అతీతంగా జరుపుకుంటారని చెప్పారు. అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ సమితి సభ్యులు కళ్ళం వెంకరెడ్డి, చీలుకోటి మురళి, పేర్లమురళి గుప్తాను సత్కరించారు.



ముత్యాలంపాడు పార్వతీసమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో గణనాథుడు



మధురానగర్ రైల్వేస్టేషన్ రోడ్డులో స్వామి



సేవా సమితి ఆధ్వర్యంలో గణేష ఉత్సవాల్లో గుప్తాను సత్కరిస్తున్న నిర్వాహకులు



26వ డివిజన్‌లో వినాయకునికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి



రాజీవ్‌నగర్‌లో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు

అధ్యాపకులు జ్ఞానానికి మార్గదర్శకులు



ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న అధ్యాపకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ విద్యా విధానం, భవిష్యత్తు కోసం ఉన్నత విద్యను రూపొందించుకోవడంలో అధ్యాపకుడు పాత్ర అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కట్టా రామ్మోహన్‌రావు ఉపన్యాసం చేశారు. ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ అధ్యాపకులు జ్ఞానానికి మార్గదర్శకులని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు అధ్యాపకులపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. విద్యార్థులను ప్రేరేపించే శక్తి, విలువలు, నైతికతను పెంపొందించే శక్తి అధ్యాపకులకే ఉంటుందని పేర్కొన్నారు. జ్ఞానం, నైపుణ్యాలు విద్యా ప్రక్రియకు కీలకమైనవన్నారు. మేధో వృద్ధి అభివృద్ధిని పెంపొందించడానికి సహాయక అభ్యాసన వాతావరణం సృష్టించాలని సూచించారు. కళాశాల విద్యా డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా మాట్లాడుతూ అధ్యాపకులు లేకుండా విద్య సాధ్యం కాదన్నారు. విద్యా వ్యవస్థకు అధ్యాపకులు వెన్నెముక అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తులసి మస్తానమ్మ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, డాక్టర్ బాలసుబ్రమణ్యం కొల్లేటి రమేష్, యుగంధర్ పాల్గొన్నారు.

అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలోని తాత్కాలిక వసతిలో కొనసాగుతున్న కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల కళాశాలలో గణితశాస్త్రం, వాణిజ్యశాస్త్రం (కామర్స్), కంప్యూటరు అప్లికేషన్స్ విభాగాల్లో అతిథి అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నామన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీ, తత్సమాన విద్యార్హత కలిగి కనీసం 55శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేయటానికి అర్హులు అన్నారు. జాతీయ/ రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష (నెట్/స్లెట్) ఉత్తీర్ణులు, ఎంఫిల్/పీహెచ్‌డీ పట్టభద్రులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వచ్చేనెల ఒకటో తేదీ కళాశాలలో నిర్వహించే మౌఖిక పరీక్షకు విద్యార్హతల ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 97052 93208 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మధురంగా సాగిన వీణా వాద్య కచేరీ



వీణపై వాగ్గేయకారుల సంకీర్తనలు పలికిస్తున్న ధూళిపాళ శ్రీనివాస్

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి 10 వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వీణా వాద్య కచేరీ శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. విఖ్యాత సంగీత విద్వాంసులు ధూళిపాళ శ్రీనివాస్ వాగ్గేయకారులు ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, సద్గురు త్యాగరాజ స్వామి రచించి స్వరపరచిన సంకీర్తనలను వీణపై మధురంగా పలికించారు. మహాగణపతి రవతుమాం, బ్రోవభారమా, స్వరరాగ సుధారస తదితర కీర్తనలు ఆలపించారు. సంగీత కళాశాల మృదంగ విద్వాంసుడు పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్ మృదంగంపై హెచ్ఎస్ భాస్కర్ వయోలిన్‌పై, గుంటూరు సంగీత కళాశాల అధ్యాపకుడు బి.హరిబాబు ఘటంపై సహకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆకాశవాణి టాప్ గ్రేడ్ సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్న శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి నిర్వాహకులను అభినందించారు. సంస్థ కార్యదర్శి సీవీరావ్ సంస్థ లక్ష్యాలను వివరించారు. సంస్థ వైస్ చైర్మన్ చిట్టా రామలక్ష్మి నిర్వహించారు. సంగీత కార్యక్రమం నిర్వహించిన విద్వాంసులను నిర్వాహకులు సత్కరించారు.

సంగీతోత్సవాలు ప్రారంభం



విజయవాడకల్చరల్: లయనాథ కళా స్రవంతి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసులు లంకా వెంకటేశ్వర్లు సంగీత సేవలను గుర్తు చేసుకుంటూ దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో ఐదు రోజులపాటు నిర్వహించే సంగీతోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. యువ సంగీత కళాకారులు కేవీ కిషోర్, బీవీ రఘునాథ ప్రణద, సాత్విక, సీనియర్ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ బీవీఎస్ఎస్ కృష్ణ, శ్రీరంజని, నాగ పూజిత, వాగ్గేయకార కృతులను ఆలపించారు. సంస్థ నిర్వాహకురాలు మాధవి మాట్లాడుతూ యువ సంగీత కళాకారులకు వేదిక కల్పిస్తున్నట్లు తెలిపారు.

జర్నలిస్టుల హౌసింగ్ ప్రాజెక్ట్‌ను కొనసాగించాలి



సీఆర్డీఏ కమిషనర్‌ను కలిసిన జర్నలిస్టు ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ రాజధాని అమరావతిలో జర్నలిస్టుల హౌసింగ్ ప్రాజెక్టును తిరిగి కొనసాగించాలని జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు సీఆర్డీఏ కమిషనర్‌కు విన్నవించారు. ఈ మేరకు గురువారం సీఆర్‌డీఏ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ కన్నబాబును కలిశారు. ఈ సందర్భంగా అమరావతి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు సొసైటీకి సంబంధించి పలు అంశాలను కమిషనర్‌కు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం బహుళ అంతస్తుల హౌసింగ్ ప్రాజెక్ట్ నిమిత్తం మందడంలో 30 ఎకరాలు భూమి కేటాయించిందని, సర్వే నంబర్లతో భూమిని సొసైటీకి ఎలాట్‌మెంట్ చేసిందన్నారు. ఇందుకు సంబంధించిన ఎలాట్‌మెంట్ లెటర్‌ను కమిషనర్‌కు అందజేశారు. టీడీపీ ప్రభుత్వం 2014–19 మధ్య కాలంలో జర్నలిస్ట్ లకు అమరావతిలో ప్రతిపాదించిన హౌసింగ్ ప్రాజెక్ట్ ను తిరిగి కొనసాగించి ప్రభుత్వమే బహుళ అంతస్తుల భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. గతంలో కేటాయించిన భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని, ప్రభుత్వం కొంత రాయితీతో హ్యాపీ నెస్ట్ మోడల్‌లో నిర్మిస్తామని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ ఉత్తర్వులు కాపీని కమిషనర్‌కు అందజేశారు. ఇదే విషయమై ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణను కలిసినట్లు తెలిపారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఈ అంశాన్ని మంత్రి వర్గ ఉపసంఘంలో పెడతామని సొసైటీ ప్రతినిధులకు తెలిపారు. కమిషనర్ కన్నబాబును కలిసిన వారిలో అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి పాటిబండ్ల నాగశ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ చావా రవి, సీనియర్ జర్నలిస్ట్ దారం వెంకటేశ్వరరావు, ప్రెస్ ఫోటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు సాంబశివరావు తదితరులు ఉన్నారు.

గురుకుల కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి, డాక్టర్ డి.యుగంధర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. శారీరక దారుఢ్య ప్రాధాన్యం, యోగా, ధ్యాన, వ్యాయామ పద్ధతులను, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. క్రీడలకు ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలియచేశారు. విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లో రాణించాలని సూచించారు. అలాగే క్రమశిక్షణవల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విశ్లేషించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్యారమ్స్ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. తొలుత దేశం గర్వించదగ్గ హాకీ క్రీడా మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుధారాణి, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ సుమిత్ర, సత్యవాణి, లావణ్య, నాగలక్ష్మి, దివ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం డాక్టర్ యుగంధర్‌ను శాలువాతో సత్కరించారు.